# ఆలాపన

తల్లిపోయేటప్పటికి రత్తమ్మకి నిండా పదేళ్ళులేవు, ఏడుస్తూ కూర్చున్న పిల్లని బలవంతాన యివతలికిలాగి, గూడెంవాళ్ళు దహన క్రియలు పూర్తి చేశారు. రత్తమ్మ ఆరోజల్లా ఏడుస్తోనేవుంది. అయితే ఏమని ఏడుస్తోందో, ఎందుకు ఏడుస్తోందో దానికి స్పష్టంగా తెలీదు. తెలిసినంతవరకూ అమ్మ తనతో రాత్రినించీ మాట్టాట్టం మానేసింది. తను పిలిచినా పలకదు కొట్టినా కదలదు. ఊరికే నేలమీద పడుకునుంటే తనకేం అర్థంకాక ఏడుపు మొదలెట్టింది. రాత్రి క్రమక్రమంగా గడుస్తోంది. అర్ధరాత్రివేళ చుట్టు పక్కల గుడిసెల్లోవాళ్ళు రత్తమ్మ ఏడుపు విని పోగడ్డారు. "ఏమే రత్తీ అట్లా ఏడుస్తున్నావు?" అంటోనో తడిక తోసుకుంటూ లోపలికి వచ్చి ఒకరి ముఖా లొకరు చూచుకున్నారు. అంతా ఒక్కసారి నిట్టూర్చి, "అదృష్ట వంతురాలు, మంచానపడి తీసుకోకుండా హాయిగా, తన రెక్కలమీద తను జీవిస్తో విశ్రాంతిగా చచ్చిపోయింది" అనుకున్నారు. "అకాలమైన చావు అయినప్పటికీ చావంటే అలావుండాలి" అన్నారందరూను. ఏమంటే రత్తమ్మ తల్లికి నిండా ముప్పైయేళ్ళు లేవు. మొగుడయినా పోయి నేడే పోయాడు. అప్పటినించీ ఒంటరిదే సతమతమవుతూ, రెండు బక్క ప్రాణాలనూ కాపాడు కొంటూ వస్తోంది. ఈనాటికి తీరు అయింది, అదృష్టం కాక మరేమిటి? దరిద్రంలో పుట్టి దరిద్రంలో పెరుగుతూ దరిద్రంతోనే పొట్టలు నింపు కొంటూ రోగాలు రాకండా మంచంమీద పడి లేచే ఓపిక లేక కనిపెట్టి వుండేవాళ్ళూ, మందూ మాకూ యిచ్చే డాక్టరులూ లేకుండా యమయాతన పడుతూ—సంతానాన్ని వొదల్లేక—పుట్టెడు కోరికలు మనసులో మెదుల్తూ౦డగా ప్రాణాలు పోవటంకన్నా యీ తీరుగా గుట్టుచప్పుడు కాకండా పడు కున్నది పడుకున్నట్లు ఊపిరి పీలవటం ఆపేసింది—అదృష్టంకాక మరే మిటి? రత్తమ్మ తల్లిచావును గురించి గూడెంలో యింతే అనుకున్నారు.

అందులో చాలామంది-చావు యెల్లానూ తప్పదు గనక తమకూ యిలాంటి చావే ప్రసాదించమని దేవుణ్ణి కోరుకున్నారు. మనస్సుల్లో ఈ అదృష్టం అందరికీ రావద్దా—అని నిట్టూర్చుకున్నారు.

రత్తమ్మ తల్లిని శ్మశానానికి తీసుకువెళ్లాక ఎవరో మహాతల్లి వచ్చి రత్తమ్మని తనయింటికి తీసుకువెళ్లింది. ఆడవాళ్లు దాన్ని బోలెడు ప్రశ్నలు వేశారు. ఆ పదేళ్ల గుంటకి జవాబులు చెప్పటమేనా కుదిరింది కాదు. ఎండ బారెడు పొద్దెక్కింది. రత్తమ్మ ఆ అమ్మ పోసిన గుక్కెడు గంజీ తాగి నిస్త్రాణగా కుక్కి మంచంమీద కూలబడింది. 'అమ్మ చచ్చిపోయింది. అమ్మని ఎక్కడికో తీసుకెళ్లారు. అమ్మ మళ్లీ రాదు. ఇంక తనకి అమ్మ లేదు—' యీ ఆలోచనల్లో తుదీ మొదలు తెలీక సతమత మవుతోంది రత్తమ్మ లేత బుర్ర.

కాస్త విశ్రాంతి చిక్కినాక, రత్తమ్మని గురించి ఆలోచించినారు, గూడెంలోవాళ్ళు. వచ్చిన చిక్కేమిటంటే, రత్తమ్మకు నా అనేవాళ్లు లేకపో లేదు. తనదని చెప్పుకోదగ్గ యిల్లు లేకపోలేదు, ఈ వూరికి నాలుగుకోసుల దూరాన్నే రత్తమ్మ పినతల్లి వుంటున్నది, దానికి మగడూ పిల్లలూ సంసార జంజాటం అంతా వున్నది, ఎప్పుడో సంవత్సరానికోసారి వచ్చి అక్కవి చూచి పోతూంటుంది, అసలు రత్తమ్మ తండ్రి పోయినప్పుడే, దాని పింతల్లి వచ్చి అక్కనీ, కూతుర్నీ తన వూరు రమ్మని పరి పరి విధాల చెప్పింది; "ఇంక నీ కీ వూళ్లో ఏం వున్నది కనక ? ఇల్లంటావా-యిదేం గొప్ప ఆస్తి కాదు గద అమ్మేస్తే పాతికో పరకో వస్తాయి. నువ్వూ నీ పిల్లా వొచ్చి మాతోపాటే వుండండి. మాకేం ఆస్తి వున్నదని రమ్మంటావు అంటావేమో- మీరూ మాతోపాటే కష్టం చెయ్యండి. అందరం కలిసే కలో గంజో తాగుదాం. కష్టం చేసేవాళ్లకు ఏ ఊరయితే నేమి?' అన్నది అక్కతో. అయితే, రత్తమ్మ తల్లి యిందుకు వొప్పలేదు, 'ఆయన ఉన్ననాళ్ళూ ఒక్క నాడూ పొరుపు లేకుండా యీ కొంపలో కాపరం చేశాను. ఆయన పోగానే

దిక్కుమాలినదానిలా యిల్లు అమ్ముకుని పరాయి పంచకు పోతే ఆయన నా మీద కోపగిస్తాడు చెల్లీ! నేనయినా యింకా ఎన్నాళ్ళో బతుకుతానని లేదు. ఆ పైన ఏం జరిగేది మనకు తెలీదు. నా తనువున్నన్నాళ్ళు ఈ గుడిసెనే అంటిపట్టుకు వుంటాను' అన్నది. చెల్లెలు యింకేమీ అనలేకపోయింది. ఈ నాటి కీ పరిస్థితి ఏర్పడింది.

అక్క పోయినట్లు కబురందగానే రెక్కలు కట్టుకు వొచ్చినట్లయింది - చెల్లెలు. పింతల్లిని చూడగానే రత్తమ్మ బావురుమన్నది. మామూలు ఏడుపు లన్నీ అయినాక. రత్తమ్మని తనతో తీసుకెడతా నన్నది పింతల్లి, గూడెం వాళ్లతో. ఆమె యీ మాట అంటుందని అందరూ యెరుగుదురు. ఇల్లాంటి దేదో జరగటమే లోకంలో సహజం. రత్తమ్మ పింతల్లి వెంట తలవొంచుకుని మేకపిల్లలా వెళ్ళింది. వెళుతూండగా వాళ్ళంతా దానికి ఘనంగా వీడ్కొలిచ్చారు. 'ఈ గుడిసెకింద నీ అమ్మా నాన్నా కాపురం చేశారు. నువ్వు కూడా పెద్దదానివయాక యిక్కడికే వొచ్చి. నీ అమ్మా నాన్నా ప్రతిష్ఠ కాపాడవే రత్తమ్మా!'' అన్నారు. ఆ మాటలు రత్తమ్మకి అర్థం కాలేదు. ఎవరు ఏమని పలకరిస్తున్నా దానికి ఏడుపే వస్తోంది. పింతల్లి వడిలో చల్లగా తలదూర్చి త్రికరణశుద్ధిగా ఏడుస్తోంది. రత్తమ్మ పింతల్లి యింటికి వెళ్ళటం యిదే మొదటిసారి. పక్కవూరికి వెళ్ళి తల్లీదండ్రీ లేని అప్పకూతుర్ని తీసుకొచ్చిందని తెలిసి వాడలో జనమంతా పింతల్లి యింటిచుట్టూ జేరి ఏమిటేమిటో మాట్లాడటం, తనని ఓదార్చటం కాసేపు రత్తమ్మకి తమాషాగానే కనిపించింది. అది యింతకు పూర్వం యింతమంది జనాన్ని ఒక్కచోట చూళ్లేదు. విడివిడిగా ఎంతోమందిని చూచినా, అందరూ కలిసి కట్టుగా ఒకచోట చేరటం చూచే అవకాశం దానికి యీ తరుణంలోనే గాని ఏర్పడింది కాదు. ఒక్కొక్కళ్ళుగా వాళ్లంతా వెళ్ళిపోయింతర్వాత రత్తమ్మ మళ్ళీ ఒంటిగా మిగిలిపోయింది. కాకపోతే రత్తమ్మ చుట్టూ దానికంటే వయసులో చిన్నవాళ్ళయిన పింతల్లి కూతుళ్ళు యిద్దరున్నారు. వాళ్ళతో

ఏం మాట్లాడేందుకూ రత్తమ్మకి ఏమీ తెలీదు. దానికెంతసేపూ తన పూరూ తన తల్లీ గుర్తుకొస్తున్నాయి. మనసులో ఒకటే బెంగ. బయటికిరాదు. ఒక్కసారిగా బావురని ఏడిస్తే యీ బరువు తగ్గుతుందేమో ననిపిస్తుంది గాని, ఎంతసేపు ఏడ్చినా—ఆ బాధ అలాగే వుంటుంది. కాని యేంచేసినా తన తల్లీ మళ్ళీ రాదుట. ఈ మాట మరీ యేడుపు తెప్పిస్తోంది రత్తమ్మకి.

రత్తమ్మ పింతల్లి కూలికి పోతూండేది. ఎక్కడయినా పని దొరికితే చేస్తుండేది. అన్నిచోట్లకూ రత్తమ్మని వెంటబెట్టుకొనే పోయేది. దాని పినతండ్రి మిల్లులో పనిచేస్తాడు. మిల్లులో పని చాలకష్టం అని పింతల్లి అంటూండగా రత్తమ్మ విన్నది. దాని జ్ఞానానికి పినతండ్రి ఎప్పుడో మిల్లులో పనిచేస్తోనే చచ్చిపోతాడని తోచింది. ఏమంటే అదే మిల్లులో పనిచేస్తోన్న వాళ్ళని గురించి చావుకబుర్లూ చెయ్యి కాలు పోయి జీవచ్ఛవాల్లా బతకాల్సిన సంగతులూ అనేకం విన్నది తను. అందుకనే కావును, పింతల్లి తనకు తోచినప్పుడల్లా మొగుడితో మిల్లుపని మానేసి యింకేమన్నా చూచుకోమని చెబుతోంటుంది. దాని కతను 'యిది మానేస్తే యిక రిక్షా లాగటమే గతి. ఉన్నన్నాళ్ళూ చల్లగా యీ వుద్యోగమే చెయ్యనిద్దూ' అంటాడు.

"అట్లాగయితే, దీనికన్నా రిక్షాలాగటమే లక్షరెట్లు నయం-" అనేది ఒక్కొక్కప్పుడు పింతల్లి. 'ఇంత బతుకూ బతికి రిక్షాలాగటమా?' అనేది ఒక్కోసారి. రత్తమ్మకి మాత్రం రిక్షాలాగటం తమాషాగా అనిపించింది మొదట ... కాని తీరా ఆలోచిస్తే అంతకన్నా తిండికిమాడి చావడమే నయమనిపించింది. ఈ మాటలన్నీ పింతల్లి దగ్గర అంటే 'అప్పుడే నీకెన్ని ఆలోచనలే, నిండా పధ్నాలుగేళ్ళు లేవు' అనేది.

రోజులు గడచినకొద్దీ రత్తమ్మకి ప్రపంచజ్ఞానం కలగసాగింది. ఈ బ్రతుకు లేమిటో డబ్బుకోసం జనం వెంపర్లాడట మేమిటో ఆలోచించ గలిగింది. ఈ సమయానికి పింతల్లికి రత్తమ్మనో యింటిదాన్నిచేసి తన బాధ్యత పూర్తయిందీ—అనిపించుకోవా లనిపించింది.

రత్తమ్మకి పెళ్ళిచెయ్యటం పింతల్లికేమీ సమస్యగా రూపొందలేదు. ఏమంటే, రత్తమ్మ కురూపి కాదు. చక్కటి పోషణ దొరికితే దొరసానిలా తయారవుతుంది, సందేహం లేదు. ఆ వూళ్ళోనే వుండి కాయకష్టం చేసుకుంటూండే ఒక కుర్రాడితో రత్తమ్మకి ముడివేసేస్తే బావుంటుందని పింతల్లి అనుకుంది. రత్తమ్మయిందుకేమీ అభ్యంతరం తెలపలేదు.

ఒక సుముహూర్తాన కులాచార ప్రకారం రత్తమ్మ వివాహం పూర్తయింది.

రత్తమ్మని చేసుకొన్నవాడికి ఆస్తిపాస్తులంటూ యేమీ లేవు. ఈ వూళ్ళో యాదృచ్ఛికంగా వుంటున్నాడు. పెళ్ళయిన కొన్ని రోజులదాకా అతనూ రత్తమ్మతోపాటే ఆమె పింతల్లి యింట్లోనే వున్నాడు. రత్తమ్మకి పద్ధతి యేవీ బావున్నట్లు తోచిందికాదు. తనకా వూళ్ళో పిత్రార్జితం అంటూ ఓ కొంప వుండనే వున్నది. ఇట్లా ఎన్నాళ్ళు తను పింతల్లి యింట్లో వుండిపోవాలి? — యిక్కడ తనకేం లోటు జరుగుతున్నదని కాదు. ఎక్కడికెళ్ళినా తమ జాతకాలింతేనని దానికి రూఢిగా తెలుసు. తన తల్లిదండ్రుల ప్రతిష్ఠ కోసం తన్నా వూరికి వెళ్ళి కాపురం చేస్తే బాగుండునని పించింది.

ఈ మాటే సమయం చూసి పింతల్లితో కదిపింది. ఆమె పాతపాటే పాడింది. 'ఒక్కదానివీ వెళ్ళి ఆ పాడుబడ్డ యింట్లో వుండకపోతేనేమే.... యిక్కడే మాతోపాటు ' అని. రత్తమ్మ ససేమిరా అన్నది. తన తల్లి అభిమానం గుర్తుతెచ్చుకుని మరీ మంకుపట్టు పట్టింది. ఇక పింతల్లి చేసేదిలేక 'నీ యిష్టమే రత్తమ్మా, నువ్వు ఎట్లాగూ ఒకనాడు ఈ మాట అంటావని నాకు ముందే తెలుసు. నీ అమ్మకు పుట్టెడు అభిమానం, నీకూ అంతే. అయినదాన్ని దగ్గరున్నాను కనక కష్టకాలంలో ఆదుకున్నా. అప్పుడప్పుడూ నువ్వూ, నీ మగడూ వొచ్చి చూచిపోతూంటే సంతోషిస్తాను. ఇంక యీ యిల్లు కదిలే వోపిక నాకు లేదు' అన్నది.

ఆ సాయంత్రమే రత్తమ్మ మొగుణ్ణి వెంటబెట్టుకుని తన తల్లీతండ్రీ వుండి వుడిగిన వూరికి వెళ్ళింది.

(ఆంధ్రప్రభ)